రెండో విడత దళితబంధు డబ్బులు వెంటనే ఇవ్వాలని సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో నినదిస్తున్న లబ్ధిదారులు

దళితబంధువుల దండయాత్ర

- రెండో విడత డబ్బులు ఇవ్వండి
- వ్యాపారాలు కొనసాగించొద్దా?
- వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోరా?
- కరీంనగర్ ప్రజావాణి కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారుల ఆందోళన
- నల్లగొండ కలెక్టరేట్ వద్ద దీక్ష
- స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- డోలాయమానంలో లబ్ధిదారులు

- దళితుల జీవితాల్లో మార్పు!

నల్లగొండలో దళితబంధు యూనిట్ల ప్రొసీడింగ్స్‌ను చూపుతున్న లబ్ధిదారులు

కరీంనగర్/నల్లగొండ, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దళితబంధు పథకం అమలులో జాప్యంపై దళితలోకం ఆందోళన చెందుతున్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల గడుస్తున్నా రెండో విడత డబ్బులను విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. వ్యాపారాలు కొనసాగించాలా? లేదా? అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్న లబ్ధిదారులు.. ఈ విషయంపై తేల్చుకునేందుకు సోమవారం హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కరీంనగర్ కలెక్టరేట్‌లోని ప్రజావాణికి తరలివచ్చారు. తమకు రెండో విడత నిధులు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలంటూ అధికారులను ప్రశ్నించడంతో చాలా సేపు గందరగోళం నెలకొన్నది. దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ వద్ద లబ్ధిదారులు దీక్షకు దిగారు. ఇదే పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా కనిపిస్తున్నది.

వినతిపత్రం ఇచ్చినా స్పందించరా?

దళితబంధు నిధుల విడుదలపై కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని, వినతిపత్రం ఇచ్చినా స్పందించడం లేదని కరీంనగర్ ప్రజావాణిలో లబ్ధిదారులు మండిపడ్డారు. నిర్దిష్ట గడువులోగా తమకు మంజూరైన నిధులు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ విజయ కలెక్టరేట్‌కు చేరుకొని లబ్ధిదారులకు మద్దతుగా నిలిచారు. కేవలం వాహనాలు కొనుగోలు చేసిన వారికి మాత్రమే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేశారని, ఇతర వ్యాపారాలు చేస్తున్న వారికి ఒక్క విడత మాత్రమే నిధులు విడుదల చేశారని చెప్పారు. వీరి ఖాతాలో ఉన్న రూ.5 లక్షలు కూడా ఫ్రీజ్ చేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. తక్షణమే రెండో విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి: కంచర్ల

నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1,100 మంది నిరుపేద దళితులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినందున వారికి దళితబంధు యూనిట్లను మంజూరు చేస్తూ గ్రౌండింగ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ కలెక్టరేట్ వద్ద దళితబంధు సాధన కమిటీ చేపట్టిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా ఒక చట్టం చేస్తే ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం దానిని అమలు చేయాలని దళితబంధు సాధన కమిటీ కన్వీనర్ పాలడుగు నాగార్జున అన్నారు.

డోలాయమానంలో లబ్ధిదారులు

దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన హుజూరాబాద్‌లో మొత్తం 18,021 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.9.90 లక్షల చొప్పున కేసీఆర్ ప్రభుత్వం జమచేసింది. అందులో 8,148 మందికి రెండో విడత డబ్బులు రావాల్సి ఉన్నది. ఈ డబ్బుల కోసం లబ్ధిదారులు అధికారులకు గతంలోనే కొటేషన్లు సమర్పించారు. వాటిని క్లస్టర్ అధికారులు పరిశీలించి ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి అందజేశారు. ఆ మేరకు నిధులు లబ్ధిదారులకు విడుదల చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం పూనుకొన్న సమయంలోనే.. ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెల రోజులైన నేపథ్యంలో చాలా మంది లబ్ధిదారులు ఇప్పటికే హైదరాబాద్ వెళ్లి ప్రజాభవన్‌లో దరఖాస్తులు సమర్పించారు. అయినా పరిష్కారం కాకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి తరలివచ్చారు.

వేలాది మందికి రాలేదు

హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 18వేల పైచిలుకు మందికి దళితబంధు పథకం అమలు చేసిన్రు. వీరిలో ఇంకా ఎనిమిదివేల మందికి రెండో విడత నిధులు విడుదల కాలేదు. కేవలం వాహనాలు తీసుకున్న వారికి మాత్రం మంజూరు చేసిన్రు. వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్న వారికి జమచేయలేదు. ఎన్నికల అనంతరం రెండో విడత మొత్తం వస్తుందనే ధీమాతో అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తున్నం. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల గడిచినా నిధుల విడుదలపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయడం లేదు. పైగా మా ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్ చేసిన్రు.

– మంద రాజేశ్, దళితబంధు లబ్ధిదారుడు (జమ్మికుంట)

కాళ్లరిగేలా తిరిగినా..

అధికారుల వైఖరితోనే మాకు దళితబంధు రెండో విడత డబ్బులు జమ కావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం నాకు 5 లక్షలు విడుదల చేసింది. రెండో విడత కోసం ఈడీ ఆఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా స్పందన లేదు. దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని నీరుగార్చుతారేమోననే అనుమానం వస్తున్నది. దళితబంధును ఇలాగే సాగనివ్వాలి. లేకుంటే దళితుల నుంచి వ్యతిరేకత తప్పదు.

– కొలుగూరి నరేశ్, దళితబంధు లబ్ధిదారుడు (జమ్మికుంట)

డబుల్ ఇండ్లు ఎందుకివ్వరు?

ఎంపిక చేసినా కేటాయించకపోవడంపై ఆగ్రహం ● యన్మన్‌గండ్లలో ఇండ్ల ఎదుటే భీష్మించిన లబ్ధిదారులు

- సొంతింటి కలను నిజం చేయని మార్పు!

యన్మన్‌గండ్ల వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

నవాబ్‌పేట, జనవరి 8: డబుల్ బెడ్రూం ఇండ్లకు అర్హులను ఎంపిక చేసినా ఇంకా ఎందుకు కేటాయించడం లేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇండ్లల్లోకి ప్రవేశిస్తుండగా అధికారులు అడ్డుకోవడం తో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం గూడులేని పేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతో నాటి జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామ సమీపంలో 48 ఇండ్లను నిర్మించింది. ఎనిమిది నెలల కిందట ఇండ్ల సముదాయాన్ని ప్రారంభించారు. తర్వాత సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అక్కడ చిన్న చిన్న పనులు పూర్తికాకపోవడంతో అర్హులకు అప్పగించలేదు. ఇంతలోపే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్ల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెల రోజులైనా ఇండ్ల కేటాయింపుపై అతీగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. సోమవారం లబ్ధిదారులంతా కలిసి ఇండ్లలోకి ప్రవేశించేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ గోవర్ధన్‌తోపాటు రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి అక్కడికి వెళ్లి లబ్ధిదారులను అడ్డుకున్నారు. వెంటనే ఇండ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో అధికారులు, లబ్ధిదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని భీష్మించారు. చివరకు చేసేది లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గత ప్రభుత్వం తమకు ఇండ్లు కేటాయించినా ప్రస్తుత అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అడ్డుతగులుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- రోడ్లపైకి తీసుకొచ్చిన మార్పు!

గృహలక్ష్మి బిల్లులు చెల్లించాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

గృహలక్ష్మిని కొనసాగించాలి

- వెంటనే బిల్లులు చెల్లించాలి
- వరంగల్ జిల్లాలో లబ్ధిదారుల నిరసన.. తహసీల్దార్లకు వినతులు

నర్సంపేట రూరల్/చెన్నారావుపేట/నల్లబెల్లి/ఖానాపురం: కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించడంతోపాటు లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలని పలువురు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లోని గృహలక్ష్మి లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన చాలామంది నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. కొందరు పిల్లర్లు, మరికొందరు స్లాబ్‌లెవల్ వరకు నిర్మాణాలు పూర్తయినట్టు పేర్కొన్నారు. వాటి బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించి బిల్లులు అందేలా చూడాలని కోరారు. చెన్నారావుపేట మండలంలోని 31 గ్రామాల్లో గృహలక్ష్మి కింద ఇండ్ల నిర్మాణం ప్రారంభించిన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సంపేటలో వందల మంది గృహలక్ష్మి లబ్ధిదారులు ధర్నా చేసి తహసీల్దార్ విశ్వప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. నల్లబెల్లి మండలంలో 328 మంది పేదలకు బిల్లులు చెల్లించాలని తెలంగాణ ఉద్యమకారుడు బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

- గొల్ల కుర్మల బతుకుల్లో మార్పు!

నల్లగొండలో గొర్రెల యూనిట్లకు ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులతో కలిసి నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్

రెండో విడత గొర్రెలు ఎక్కడ?

- కలెక్టరేట్ వద్ద లబ్ధిదారుల నిరసన
- పంపిణీలో జాప్యంపై ఆగ్రహం
- పాల్గొన్న గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల

నల్లగొండ, జనవరి 8: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారందరికీ గొర్రెల యూనిట్లు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సూచన మేరకు రాష్ట్రవ్యాప్తంగా 82 వేల మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించడంతో ఆ డబ్బులను ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఒక్కో లబ్ధిదారుడు సబ్సిడీ కింద రూ.43,750 డీడీ రూపంలో చెల్లించగా అవి రూ.34.34 కోట్లు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. వారికి యూనిట్లు ఇచ్చే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ఆగిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గొర్రెల యూనిట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.

పథకాలను కొనసాగించాల్సిందే

- సంగారెడ్డి జడ్పీ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రతిపాదనకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మద్దతు

సంగారెడ్డి, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కార్ మంజూరు చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం సరికాదని సంగారెడ్డి జడ్పీ సర్వసభ్య సమావేశం అభిప్రాయపడింది. సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీ బీబీపాటిల్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్ మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ పనులు జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు మంజూరు చేసి ఇంకా ప్రారంభం కాని ఎస్‌డీఎఫ్, ఏసీడీఏపీ ఇతర పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం సరికాదని అన్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఈఈ జగదీశ్వర్ స్పందిస్తూ.. అందోలు నియోజకవర్గం మినహాయించి మిగతా నాలుగు నియోజకవర్గాల్లో ప్రారంభంకాని పనులు నిలిపివేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించినట్టు తెలిపారు. దీంతో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌డీఎఫ్ సహా అన్ని పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జడ్పీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సైతం మద్దతు పలికారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కూడా ప్రారంభం కాని పనులు కొనసాగాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. ఎస్‌డీఎఫ్ పనులు నిలిపివేయాలని మంత్రి దామోదర చెప్పకపోవచ్చని, తాను మంత్రితో మాట్లాడతానని పేర్కొన్నారు. ఎంపీ బీబీ పాటిల్ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లా రైతులకు మేలు చేసే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను కొనసాగించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వంలో దళితబంధు, బీసీబంధు, మైనార్టీ సంక్షేమ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు యథావిధిగా ఆర్థికసాయం అందజేయాలని సూచించారు.

పదోన్నతులు తేలితేనే మెగా డీఎస్సీ!

- టెట్‌లో ఉత్తీర్ణులైతేనే ప్రమోషన్స్
- అందుకే నిలిచిన పదోన్నతులు
- మేలో టెట్ నిర్వహించే యోచన
- ఆ తర్వాతే పదోన్నతులు
- ఒకదానికొకటి లింకులు..

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నా, ఇందుకు టీచర్ల పదోన్నతుల అంశం అడ్డంకిగా మారే పరిస్థితి కనిపిస్తున్నది. టీచర్ల పదోన్నతులకు, మెగా డీఎస్సీకి మధ్య పెద్ద లింకు ఉన్నది. ఉపాధ్యాయ పదోన్నతులు కల్పిస్తే దాదాపు 8,000 టీచర్ పోస్టులు అందుబాటులోకి వస్తాయన్న అంచనాలు ఉన్నాయి. ఉపాధ్యాయ నియామకాలతోపాటు, వారికి పదోన్నతులు కల్పించాలంటే విద్యాహక్కు చట్టం, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) నిబంధనల ప్రకారం ఆయా అభ్యర్థులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. సెకండరీ గ్రేడ్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందాలంటే టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. పదోన్నతులకు టెట్ తప్పనిసరి కావడంతో 2015 లోపు టీచర్లంతా ఉత్తీర్ణులు కావాలని కేంద్రం గడువు విధించింది. ఆ తర్వాత మరో ఐదేండ్లు పొడిగించింది. అప్పట్లో విద్యాశాఖ కొత్త రిక్రూట్‌మెంట్లకే టెట్‌ను అమలుచేసింది. పదోన్నతులు కల్పించే పరిస్థితులు, అర్హులు లేకపోవడంతో టీచర్లు సైతం దీనిని అంత సీరియస్‌గా తీసుకోలేదు. గత డిసెంబర్‌లో టెట్‌తో సంబంధం లేకుండానే పదోన్నతులు కల్పించాలని విద్యాశాఖ భావించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ కొంతమంది టీచర్లు టెట్ ఉన్న వారికే పదోన్నతులు కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎస్ఏ, జీహెచ్ఎం పదోన్నతులకు బ్రేకులుపడ్డాయి.

మేలో టెట్?

మెగా డీఎస్సీ, టీచర్ల పదోన్నతుల నేపథ్యంలో మేలో టెట్‌ను నిర్వహించాలని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. టీచర్లకు ప్రత్యేకంగా టెట్‌ను నిర్వహించాలన్న డిమాండ్లు ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తున్నా ఇది సాధ్యంకాదని విద్యాశాఖ స్పష్టంచేసింది. టెట్‌ను నిర్వహిస్తాం కానీ ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థులతో పాటే టీచర్లు కూడా టెట్ రాసుకోవాలని చెప్తున్నది. ఇప్పుడు టెట్ నిర్వహిస్తే క్వాలిఫై కావడం అంత సులభంకాదని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. గత సెప్టెంబర్‌లో నిర్వహించిన టెట్ పేపర్-2లో 15.30 శాతమే క్వాలిఫై అయ్యారు. 2022లో 49.64%, 2017లో 19.51%, 2016లో 25.04% టీచర్లు మాత్రమే క్వాలిఫై అయ్యారు. దీంతో పదోన్నతులపై ఆశలు పెట్టుకున్న టీచర్లకు టెట్ బెంగపట్టుకున్నది. పదోన్నతులపై హైకోర్టు ఎలాంటి స్టే విధించలేదని, టెట్ అర్హత గల వారికి పదోన్నతులు కల్పించాలని టెట్ క్వాలిఫైడ్ టీచర్స్ ఫోరం నేత పరశురాం ప్రభుత్వాన్ని కోరారు.

వాస్తవ పరిస్థితులిలా..

- రంగారెడ్డి జిల్లా హిమాయత్‌సాగర్ జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన ఒక టీచర్ 1987లో స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరగా, ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగుతున్నారు. . సీనియార్టీ ప్రకారం జీహెచ్ఎం పదోన్నతికి అవకాశం ఉన్నప్పటికీ, టెట్ లేకపోవడంతో ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.
- మంచిర్యాల జిల్లా దేవాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న టీచర్ 1998 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్)గా నియమితులయ్యారు. గెజిటెడ్ హెచ్ఎం పదోన్నతి పొందాలన్న ఆశతో 2011 టెట్‌కు హాజరై క్వాలిఫై అయ్యారు. నిబంధనల ప్రకారం ఆయనకు పదోన్నతి కల్పించాల్సి ఉన్నది. కానీ, సీనియర్లను పక్కకుతోసి పదోన్నతి కల్పిస్తే వారు అంగీకరించే పరిస్థితి లేదు. ఇలాంటి వారి వ్యవహారాల్లో కోర్టు వివాదాలు తలెత్తే అవకాశం ఉన్నది.

ఒరిజినల్ ఐడీలుంటేనే బస్సు ఫ్రీ

- చిరునామా స్పష్టంగా కనిపించాలి
- ఫొటో ఉండాలి.. పాన్‌కార్డు చెల్లదు
- తెలంగాణ మహిళలకే ఉచితం:
- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకంలో మహిళలు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డును వెంట తేవాల్సిందేనని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మరోసారి తేల్చిచెప్పారు. కొందరు మహిళా ప్రయాణికులు సెల్‌ఫోన్లలో లేదా జిరాక్స్ కాపీలు చూపుతూ కండక్టర్లపై ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ నూతన మార్గదర్శకాలను ఖరారు చేసింది. గుర్తింపు కార్డులో ప్రయాణికురాలి ఫొటో, చిరునామా స్పష్టంగా కనిపించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే ఏ ఒరిజినల్ గుర్తింపు కార్డు అయినా ఈ స్కీంకు వర్తిస్తుందని ఎండీ తెలిపారు. పాన్‌కార్డులో అడ్రస్ లేనందున అది ఉచిత ప్రయాణానికి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. మహిళా ప్రయాణికులందరూ జీరో టికెట్‌ను తీసుకోవాలని, ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుంటే కచ్చితంగా డబ్బు చెల్లించి టికెట్ తీసుకోవాలని చెప్పారు. ఉచితమే కదా.. జీరో టికెట్ ఎందుకు తీసుకోవాలని కొందరు సిబ్బందితో వాదనకు దిగుతున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. జీరో టికెట్ల జారీ ఆధారంగానే ఆ డబ్బును ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.500 జరిమానా విధిస్తామని ఎండీ సజ్జనార్ హెచ్చరించారు. మహాలక్ష్మి పథకం తెలంగాణ మహిళలకే వర్తిస్తుందని, ఇతర రాష్ట్రాల మహిళలు చార్జీ చెల్లించి విధిగా టికెట్ తీసుకోవాలని తెలిపారు.

గ్రూప్-1లో మళ్లీ ఇంటర్వ్యూ?

- తొలగించిన విధానం మళ్లీ తెరపైకి
- సంకేతాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి
- అదే జరిగితే నియామకాలు ఆలస్యం
- పారదర్శకత కోసం ఇంటర్వ్యూలు రద్దుచేసిన కేసీఆర్ సర్కార్



హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1లో కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్వ్యూ విధానం మళ్లీ మొదలు కాబోతున్నదా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తున్నది. టీఎస్‌పీఎస్సీ వర్గాల్లో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. టీఎస్‌పీఎస్సీలో మార్పుచేర్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. డిసెంబర్ చివరివారంలో కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్ కేరళ వెళ్లి అక్కడి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సందర్శించి అధ్యయనం చేశారు. ఈ నెల 5న సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి యూపీఎస్సీ కార్యాలయాన్ని సందర్శించి చైర్మన్ మనోజ్‌సోనీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎస్సీలో ప్రతి నియామకానికి ఉండే ఇంటర్వ్యూ విధానంపై ప్రత్యేకంగా చర్చించారు. ఇంటర్వ్యూ విధానాన్ని గ్రూప్-1లోనూ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్టు సమాచారం.

పారదర్శకతకు కేసీఆర్ పెద్దపీట

ఉమ్మడి ఏపీలో గ్రూప్-1 ఇంటర్వ్యూలో అక్రమాలు, పైరవీలు జరగడం, తెలంగాణ వారిని కాదని ఆంధ్రప్రాంతం వారికి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చినట్టు ఆరోపణలు రావడంతో అప్పటి సీఎం కేసీఆర్ గ్రూప్-1 స్థాయిలో ఇంటర్వ్యూలు రద్దుచేసి పారదర్శకతకు పెద్దపీట వేశారు. ఇంటర్వ్యూల రద్దుతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. కష్టపడితే చదివితే ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకం వారిలో పెరిగింది. ఇప్పుడు మళ్లీ ఇంటర్వ్యూలు ప్రవేశపెట్టబోతున్నారన్న వార్తలతో వారంతా ఆందోళనలో మునిగిపోయారు. ఈ విషయమై టీఎస్‌పీఎస్సీ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా సమాధానం చెప్పేందుకు అధికారులు నిరాకరించారు.

ఇంటర్వ్యూలతో కాలయాపన

ఇంటర్వ్యూ విధానంతో ఉద్యోగ నియామకాల్లో కాలయాపన జరిగే అవకాశం ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఒక్కో ఇంటర్వ్యూకు సగటున 30 నిమిషాలు పడుతుంది. ఈ లెక్కన గ్రూప్-1 క్యాటగిరీలో 503 ఉద్యోగాలకు 1:3 నిష్పత్తిలో 1,509 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయాల్సి ఉంటుంది. రోజుకు 25 మందిని ఇంటర్వ్యూ చేసినా తక్కువలో తక్కువ మూడు నెలలు పడుతుంది. గ్రూప్-2 క్యాటగిరీలో ఎక్కువ సంఖ్యలో పోస్టులు ఉండడం వల్ల వేలాది మందిని ఇంటర్వ్యూ చేయాల్సి వస్తుంది. ఫలితంగా నియామక ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎస్‌పలో వేతనాలు పెండింగ్

- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 2 నెలలుగా జీతాల్లేవ్
- కేజీబీవీల్లో కూడా అదే పరిస్థితి
- రాష్ట్రవాటా నిధులివ్వని ప్రభుత్వం
- ఫలితంగా రూ.150 కోట్లు బ్లాక్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్ట్, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెండు నెలల వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. నవంబర్, డిసెంబర్ వేతనాలు అందకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సంక్రాంతిలోగా జీతాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పరిధిలో 22 వేలకుపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కేంద్రం రూ.